
జైళ్ల అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి తదితరులు

## జైళ్ల అదాలత్‌లో 20 కేసులు పరిష్కారం

సైదాబాద్, మే 24: రాష్ట్ర జైళ్ల శాఖ సహకారంతో శనివారం జైళ్ల ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంచల్‌గూడ జైలులో నిర్వహించిన జైలు అదాలత్‌ను న్యాయవాదులు నిర్వహించారు. ఇందులో 20 కేసులను పరిష్కరించారు. చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కె.అజేష్ కుమార్ 3 కేసులను, నాల్గవ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ స్వర్ణలత 7, పదవ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కె.ప్రతాప్ 10 కేసులను పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జగన్మోహన్‌రావు

వనస్థలిపురం, మే 24 : యాంత్రిక జీవనంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని అక్షర విద్యాసంస్థల చైర్మెన్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అర్షనపల్లి జగన్‌మోహన్ రావు అన్నారు. శనివారం ఎల్బీనగర్ అక్షర ఇంటర్ నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే జీవితంలో ఏదైనా సాధించగలడన్నారు. శిబిరంలో సుమారు వెయ్యి మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయినగర్ గుడిసె వాసులకు న్యాయం చేయాలి

### కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి


సాయి నగర్ గుడిసె వాసుల ఇండ్ల నిమిత్తం కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

మన్సురాబాద్, మే 24: నాగోల్ డివిజన్ పరిధిలోని సాయినగర్ గుడిసెల్లో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇండ్లను కోల్పోయిన బాధితులతో కలిసి శనివారం ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రూను కలిశారు. సాయినగర్ గుడిసెల్లో నివాసముంటున్న పట్టాలు కలిగి ఉన్న సుమారు 650 మందికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయాలని కోరారు. పథకాన్ని అమలు చేయడంతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించారు. పక్కా ఇండ్లు నిర్మించడం వలన భవిష్యత్తులో ఏదేని అగ్ని ప్రమాదాలు సంభవించిన ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఉంటుందని తెలిపారు. కాలనీలో నివసిస్తున్న కొందరికి 30 నుంచి 40 గజాల స్థలం ఉన్న నేపథ్యంలో వారికి జీప్లస్ వన్ నిర్మాణానికి అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు సుమారు 400 ఎస్ఎఫ్టీ స్థలం ఉండాలని తెలిపారు. సాయి నగర్ గుడిసె వాసుల ఇందిరమ్మ ఇండ్ల పథకంపై హౌసింగ్ బోర్డ్ ఎండితో మాట్లాడి పేదలకు న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. చందు, పైమిద, పాష, సాహిదాబేగం, యాదయ్య, శ్రీనివాసులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## సబితారెడ్డితోనే సమస్యలు పరిష్కారం

### ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్


ఎన్టీఆర్‌నగర్‌లో గుంతలను పూడుస్తున్న పెండ్యాల నాగేష్, టీఆర్ఎస్ నాయకులు

ఆర్కేపురం, మే 24 : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముందు వరుసలో ఉంటారని ఆర్కేపురం డివిజన్ బీఆర్ ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ మెయిన్ రోడ్డులో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురికావడంతోపాటు, వాహనాలు మరమ్మతులకు గురవుతుండటంవల్ల ఎమ్మెల్యే సబితారెడ్డి సూచన మేరకు డివిజన్ టీఆర్ ఎస్ నాయకులు జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో శనివారం గుంతలు పూడ్చి సమస్య పరిష్కరించారు. ఈ సం దర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. కాలనీలో ఇటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే తోపాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. నాయకులు సాజీద్, నిరంజన్, దీపు పాల్గొన్నారు.

# గుంటిజంగయ్య కాలనీ సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గుంటిజంగయ్య కాలనీవాసులు, చింతల రవికుమార్ తదితరులు

### ఎమ్మెల్యేను కోరిన కాలనీవాసులు

వనస్థలిపురం, మే 24 : వనస్థలిపురం డివిజన్ గుంటిజంగయ్య కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు కన్నా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్‌తో కలిసి శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. మౌలిక వసతుల కల్పన అభివృద్ధితోపాటు, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. దుర్గా అంబిక దేవాలయం ముందు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించేందుకు కృషి చేస్తామన్నారు. జలమండలి అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రాజ్, గుంటి బాబురావు, నర్సింగ్, రజనీకాంత్, సతీష్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు పూజలు


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత తదితరులు

సైదాబాద్, మే 24: సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రూ.11 లక్షలా 56 వేలతో ఏర్పాటు చేస్తున్న నూతన సీసీ రోడ్ పనులను ఐ ఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను నాణ్యత ప్రణాళికతో చేయాలని కాంట్రాక్టర్లకు, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులకు సూచించారు. ఏఈ శిరీష, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆగమేఘాలతో రాత్రి వేళల్లో రోడ్డు నిర్మాణ పనులు

### నమస్తే కట్టడానికి స్పందన


సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో రాత్రి వేళల్లో రోడ్డు వేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



సైదాబాద్, మే 24: జీ హెచ్ఎంసీ సంతోష్ నగర్ సర్కిల్ పరిధిలోని ఐఎస్ సదన్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారుల, కాంట్రాక్టర్ చేతివాటం బట్టబయలైంది. పనులు చేయకుండా చేసినట్లు దొంగ రికార్డులను సృష్టించి జీహెచ్ఎంసీ సంస్థను బురిడీ కొట్టించి సుమారు పది లక్షల రూపాయలను స్వాహా చేసిన అంశాన్ని శనివారం రూ.10 లక్షల బిల్లులు స్వాహా అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ కమిషనర్ కణ్ణన్ స్పందించి విచారణకు అధికారులను ఆదేశించారు. దీంతో ఉల్కిపడ్డ సంతోష్ నగర్ జీహెచ్ ఎంసీ అధికారులు, సదరు కాంట్రాక్టర్ శనివారం రాత్రి సింగరేణి బాంబే గృహాల్లో కొత్త గా సీసీ రోడ్డు వేయడానికి పునుకున్నారు. రాత్రి వేళల్లో ఆగమేఘాలతో రోడ్డు వేయడానికి చేస్తున్న ప్రయత్నాలను చూసి స్థానికులు నవ్వుకుంటున్నారు. తన డివిజన్లో అభివృద్ధి పనులలో అధికారుల అవినీతి భాగోతాన్ని స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత నేరుగా కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో అధికారుల అవినీతి బయట పడింది. దీంతో అధికారులు తమ దిద్దు బాటు చర్యలు చేపట్టారు. ఎక్కడైతే పనులు చేయకుండా బిల్లులు స్వాహా చేశారో అక్కడే కొత్తగా రోడ్డు వేయడానికి సిద్ధమై పనుల్లో నిమగ్నమయ్యారు.

## ఉస్మానియా దవాఖానలో అన్నదానం

జియాగూడ, మే 24 : టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా ఉస్మానియా దవాఖానలో రోగులకు శనివారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనుకొండూరు మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్, చాంద్రా యణగుట్ట కాంటెస్ట్ ఎమ్మెల్యే బొయ్య నగేశ్, ప్రవీణ్, పీసీసీ కార్యదర్శి, టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్‌యాదవ్, పార్టీ సీనియర్ రాందీర్ సింగ్ ఠాగూర్ టీపీసీసీ కార్యదర్శి , కె. నరసింహనేత, ప్రధాన కార్యదర్శి (చేనేత విభాగం) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు, ఉస్మానియా దవాఖాన అర్ఎంవో డాక్టర్ రఫీ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఇందిరమ్మ కమిటీ సభ్యులు

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత

కందుకూరు, మే 24 : మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి తో కలిసి ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సన్నీల నరసింహ ఉదయ కిరణ్ అంజయ్య ప్రశాంత్ రెడ్డి జంగమ్మ పారేశా శ్రీనివాస్ మహేష్ శ్యామలమ్మ పాల్గొన్నారు.

**నేదునూరులో ....**

పంచాయతీ సెక్రటరీ రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల 111 లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.

## శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

అంబర్ పేట, మే 24: యువత, మహిళలు శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నా రు. శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని రత్నానగర్, సత్యనగర్ బస్తీల్లో పర్యటించారు. అక్కడ నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిరా ణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడు తూ.. స్కిల్స్ లేమితో స్థానికులకు ఉద్యోగాలు దక్కడం లేదని అన్నారు. యువత, మహిళలు కూడా తమలోని నైపుణ్యాలను పెంచుకోవడం లో ప్రాధాన్యత నీయాలని చెప్పారు. తద్వారా ఆర్థికంగా కూడా ప టిష్టం అవుతారని మంత్రి చెప్పారు. రత్నానగర్, సత్యనగర్‌లలో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ ల నిర్మాణాలను పరిశీలించానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రత్నానగర్‌లో ఓ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టానని చెప్పారు. ఈ బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లు, బస్తీ దవాఖానలు, డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెరగాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం జీహెచ్ ఎంసీ ఆధ్వర్యంలో నిధులను త్వరితగతిన కేటాయిస్తే సదుపాయాల కల్పనలో వేగం పెరుగుతుందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## పశువుల వధను అడ్డుకోవాలి


రవీంద్రభారతి, మే 24 : బక్రీద్ పండుగ సందర్భంగా జంతువుల వధను అడ్డుకోవాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసి న మీడియా సమావేశంలో సెక్రటరీ మహేశ్ అగర్వాల్, జాయింట్ సెక్రటరి రితేష్ జాగిర్గర్, ఉపాధ్యక్షుడు జస్వత్ పటేల్‌లతో కలిసి అధ్యక్షుడు జస్రాజ్ శ్రీ మాల్ మాట్లాడుతూ.. నగరానికి పశువులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. పక్రీద్ పండుగను పురస్కరించుకొని నగరంలో దాదాపు 10వేల పశువుల వధ జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. రాతపూర్వకంగా పర్మిషన్ ఉన్న పశువులు మాత్రమే నగరానికి తేవాలని అన్నా రు. ఈ ఘటనపై గత మూడు రోజులుగా ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ డీజీపీని కలిసేందుకు ప్రయత్నించిన సాధ్యమ కాలేదని వారు పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో డ్రైనేజీ సమస్యకు మోక్షం


గోల్నాక లంక బస్తీలో పూడిక తీత పనులు పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

గోల్నాక, మే 24:గోల్నాక డివిజన్ తులసీరాంనగర్ లంక బస్తీ వాసులకు ప్రధాన ససమస్యగా మారిన డ్రైనేజీ సమస్యకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రత్యేక చొరవతో మోక్షం లభించింది. గత కొన్ని రోజులుగా లంక బస్తీలో డ్రైనేజీ పైప్ లైన్లు పూర్తిగా కూరుకు పోవడంతో ఇండ్ల ముందు ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచి పోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను బస్తీ వాసులు శనివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జలమండలి డీఎం విష్ణువర్ధన్ కు సమస్యను ఫోన్ లో వివరించారు. వెంటనే అక్కడికి వెళ్లి క్షేత్ర స్థాయిలో సమస్యను పరిశీలించడంతో పాటు యుద్ధప్రాదిపదిక సమస్య పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో డీజీఎం రామకృష్ణ, మేనేజర్ రోహిత్ తో పాటు తమ సిబ్బందితో కలసి ఆయన లంకబస్తీలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడిన ఆమన సమస్యను పరిశీలించి డ్రైనేజీ పైప్ లైన్లు పూర్తిగా మూసుకు పోయాయని గుర్తించారు. తమ సిబ్బందితో పైప్ లైన్లలో పేరు పోయిన వ్యర్థాలను ఎట్ట కేలకు అతి కష్టం మీద శుభ్రం చేయించారు. దీంతో స్థానిక ప్రధాన సమస్యకు మోక్షం లభించడంతో స్థానిక బస్తీ వాసులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సీతారాం

కందుకూరు, మే 24 : ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ సీతారాం అన్నారు. హైదరాబాద్ శ్రీశైలం రహదారి నేదునూరు గేట్ వద్ద మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతా ప్రభాకర్ రెడ్డి, తన సొంత నిధులు రూ. 45 వేలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శనివారం సీతారాం , ఎస్సై సైదులు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందుకోసం దుకాణాల వద్ద రద్దీగా ఉండే ప్రదేశాలు, పెట్రోల్ బంకులు సినిమా హాల్ లు వద్ద గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల్ కోఆర్డినేటర్ ఎండి అఫ్జల్ బేగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంకగాళ్ల పుష్ప దర్శన్, సొసైటీ డైరెక్టర్ సాదా పాండు రంగారెడ్డి, గ్రామ అధ్యక్షుడు బొర్రా సురేష్, ఇందిరమ్మ డైరెక్టర్ వరికుప్పల మంజుల బాబు, గంగుల సంజీవ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు ఎగిరిశెట్టి నర్సింహ, మైనారిటీ నాయకులు అజారోద్దీన్, ఫైజోద్దీన్, సీనియర్ నాయకులు వరికుప్పల రవి, బొజ్జ రాఘవేందర్ రెడ్డి, కుమార్ గౌడ్, బిక్షపతి జమేధర్ మల్లేష్, కానిస్టేబుల్ శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవయవదానం చేసి ప్రాణదాతలుకండి

ఆర్కేపురం, మే 24 : అవయవాల దానంపై అవగాహన పెంచాలని అఖిల భారత శరీర అవయవాల దాతల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీతా మహాలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఆర్‌కెపురం డివిజన్ చిత్రా లేవుట్ కాలనీలో సీనియర్ సిటిజన్ అప్పారావు పుట్టిన రోజు ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, చిత్రా లేవుట్ కాలనీ వాకర్స్ క్లబ్ సంయుక్తంగా శనివారం శరీరం అవయవాల దానాలపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శరీరం అవయవాల దానాల పై అపోహలు ఉన్నాయని వాటిని తొలగించడానికి స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం కృషి చేయాలని ఆమె కోరారు. అవయవాల దానాలు చేయడం ద్వారా మరణించిన అనంతరం కూడా మరణించిన వారి అవయవాలు జీవించి ఉంటాయని డాక్టర్ సీతా మహాలక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు షరతులు అనుమతితో ఎవరైనా చట్ట ప్రకారం శరీరం అవయవాల దానం చేయవచ్చునని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, రావుల నర్సింహారెడ్డి, పి. అంజయ్య, రజిని, శ్రీనివాస్ రావు, గంగాధర్ రెడ్డి, రాఘవ రెడ్డి, జనార్ధన్, అంజన్‌రావు, అంబరీష్, సత్యనారాయణ, గోవర్ధన్, బాలిరెడ్డి, సబితారెడ్డి, స్వర్ణలత, వేద సంహిత, శైలజ పాల్గొన్నారు.



## ట్రాన్స్ జెండర్ పై కుర్చీతో దాడి.. కేసు నమోదు

హయత్ నగర్, మే 24 : ట్రాన్స్ జెండర్ పై కుర్చీతో దాడి చేసి స్కూటీకి నిప్పంటించిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ, కుంట్లూరుకు చెందిన సంపత్ నిఖిత(32), ట్రాన్స్‌జెండర్. మన్సురాబాద్‌కు చెందిన శ్రీను (25)తో గత నాలుగేళ్లుగా సహజీవనం చేస్తోంది. శ్రీను దురుసు ప్రవర్తన కారణంగా ఆమె గత పది నెలలుగా విడిగా నివసిస్తోంది. ఈ నెల 23న రాత్రి 1:30 గంటకు శ్రీను ఆమె ఇంటికి తిరిగి రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కుర్చీతో ఆమెపై దాడి చేసి, రాయితో కిటికీ అద్దం పగులగొట్టి ఆమె స్కూటీకి నిప్పంటించి పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## మెరుగైన సేవలు అందిస్తాం

చార్మినార్, మే 24: రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యం కో సం అధిక ప్రాధాన్యత నిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తుందని .. పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ టి. విజయకుమారి అన్నారు. శనివారం పెట్ల బురుజు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెం డెంట్‌గా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ రజిని రెడ్డి బదిలీ కావడంతో ఆమె స్థానంలో నిలోఫర్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న టి. విజయకుమారి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోనే అతి పెద్దదైన ఈ ఆసుపత్రిలో గర్భిణులు ప్రతిరోజూ వందలాదిమంది వస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది సైతం రోగులను ఇబ్బంది పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. రోగులు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని ఆమె తెలిపారు.

## వేర్వేరు ఘటనల్లో రైలు ఢీకొని ఇద్దరు మృతి

కాచిగూడ, మే 24: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఉప్పుగూడలోని కృష్ణారెడ్డినగర్‌కు చెందిన అభిషేక్(29) శుక్రవారం అర్ధరాత్రి యాకత్ పుర-ఉప్పుగూడ రైల్వే స్టేషన్ మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పో లీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మాని యాకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఉప్పుగూడలో మహిళ ..

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఉప్పుగూడలోని లలితాబాగ్ ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ భార్య లక్ష్మి(49) వృత్తిరీ త్యా కూలీ. శనివారం యాకత్ పుర- ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.